

రబీ పంటను ఇ-క్రాప్‌లో నమోదు చేయించుకోవాలి

మండవల్లి : రబీ పంటను రైతులు తప్పనిసరిగా ఇ-క్రాప్‌లో నమోదు చేయించుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి ఎస్‌కె.హబీబ్‌బాషా తెలిపారు. స్థానిక డివిజన్ వ్యవసాయ శాఖ సహాయ సంచాలకుల కార్యాలయంలో జిల్లా వనరుల కేంద్రం ఏలూరు శాఖ ఆధ్వర్యంలో గ్రామ వ్యవసాయ సహాయకులకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన రబీ పంటను ఇ-క్రాప్‌లో నమోదు చేయడంతో పాటు తప్పనిసరిగా ఇ-కెవైసి చేయించాలన్నారు. విఎఎలు అందుబాటులో ఉండి రైతులకు సేవలందించాలని, ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని తెలిపారు. అనంతరం రైతులకు అందించే పలు రకాల స్కీములపై సమీక్ష సమావేశం నిర్వహించి రైతు సేవ కేంద్రం సిబ్బందికి పలు సూచనలను, సలహాలను అందించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు జి.వెంకటమణ, ముదినేపల్లి, మండవల్లి ఎఒలు ఎస్‌కె.జరీనా, వేణుమాధవ్ పాల్గొన్నారు.

నానికి లైన్ క్లియర్..!

- నేడు టిడిపి గూటికి మాజీ మంత్రి ఆళ్ల నాని
- నిన్నటి వరకూ నానిపై సోషల్ మీడియాలో వీరంగం
- చంద్రబాబు జోక్యంతో ఏలూరులోని తెలుగు తమ్ముళ్లు గప్‌చుప్
- నాని చేరికను ధ్రువీకరించిన ఎంఎల్ఎ బడేటి చంటి



ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

మాజీ మంత్రి ఆళ్ల నాని టిడిపిలో చేరేందుకు లైన్‌క్లియర్ అయ్యింది. నాని చేరికపై నిన్నటి వరకూ చిందులు తొక్కిన ఏలూరు తెలుగు తమ్ముళ్లు సిఎం చంద్రబాబు జోక్యంతో ఎక్కడికక్కడే గప్‌చుప్ అయిపోయారు. బుధవారం చంద్రబాబు సమక్షంలో నాని టిడిపి తీర్థం పుచ్చుకోనున్నారు. ఆళ్ల నాని టిడిపిలో చేరికకు సంబంధించి ఏలూరు ఎంఎల్ఎ బడేటి చంటి మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో స్పష్టత ఇచ్చారు. కొద్దిరోజుల క్రితం ఆళ్ల నాని టిడిపిలో చేరేందుకు అన్ని ఏర్పాట్లూ చేసుకుని అమరావతి వెళ్లినప్పటికీ బ్రేక్ పడింది. అందుకు ప్రధాన కారణం ఏలూరులోని టిడిపి నాయకులు, కార్యకర్తలు ఆళ్ల నాని చేరికను తీవ్రంగా వ్యతిరేకించడమే. అధికారంలో ఉన్నప్పుడు టిడిపి కార్యకర్తలను తీవ్ర ఇబ్బందులకు గురిచేశారని, టిడిపి కార్యకర్తల ఇళ్లు, దుకాణాలు కూలగొట్టారంటూ సోషల్ మీడియాలో పోస్టులు పెట్టడంతోపాటు, టిడిపి అధిష్టానానికి పంపించారు. దీంతో నాని చేరికను తాత్కాలికంగా టిడిపి అధిష్టానం వాయిదా వేసింది. మంగళవారం పోలవరం పర్యటనకు వచ్చిన సిఎం చంద్రబాబు ఎంఎల్ఎ బడేటి చంటితో ఆళ్ల నాని చేరిక గురించి మాట్లాడినట్లు తెలిసింది. నానిని చేర్చుకోవాలని అధిష్టానం నిర్ణయించడంతో ఎంఎల్ఎ సైతం అంగీకరించినట్లు తెలిసింది. అధిష్టానం ఆదేశాలతోనే విలేకరుల సమావేశం పెట్టి ఆళ్ల నాని చేరికను ముందుగానే ధ్రువీకరించడమే కాకుండా రాబోయే రోజుల్లో అంతా కలిసి పని చేస్తామని సైతం చెప్పారు. దీంతో నాని టిడిపిలో చేరడం ఖాయమని తేలిపోయింది. నాని టిడిపిలో చేరడం వెనుక పెద్ద తతంగమే నడిచినట్లు సమాచారం. మంత్రిగా ఉన్నప్పుడు చేసిన కొన్ని పనులపై కూటమి ప్రభుత్వం విచారణ చేయిస్తే అరెస్టు వంటి ఇబ్బందులు తలెత్తే ప్రమాదం ఉందనే భయంతోనే నాని టిడిపిలో చేరుతున్నట్లు ప్రచారం సాగుతోంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే వైసిపి జిల్లా అధ్యక్ష పదవికి రాజీనామా చేసిన నాని, తర్వాత పార్టీ సభ్యత్వానికి సైతం రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. ప్రత్యక్ష రాజకీయాలకు దూరంగా ఉంటున్నట్లు తెలిపారు. అయితే అనూహ్యంగా టిడిపిలో చేరుతున్నట్లు సమాచారం బయటికి పొక్కడంతో అంతా అవాక్కయ్యారు. ఆయన టిడిపిలో చేరికకు విజయనగరానికి చెందిన ఒక నేత తీవ్రంగా కృషి చేసినట్లు చెబుతున్నారు.

ఇప్పటికే ఏలూరులో వైసిపి నేతలంతా టిడిపి చెంతన

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఏలూరు నియోజకవర్గంలో వైసిపి కీలక నేతలంతా టిడిపిలో చేరిపోయారు. మేయర్ షేక్ నూర్జహాన్, ఆమె భర్త పెదబాబు, ఇతర నేతలు బొద్దాని శ్రీనివాస్, మంచెం మైబాబుతోపాటు పెద్దసంఖ్యలో కార్పొరేటర్లు, జెడ్‌పి ఛైర్‌పర్సన్ గంటా పద్మశ్రీ, ఆమె భర్త గంటా ప్రసాద రావుతో పాటు కీలక నేతలంతా టిడిపి తీర్థం పుచ్చుకున్నారు. దాదాపుగా ఆళ్ల నాని మినహా వైసిపి నేతలంతా ప్రస్తుతం టిడిపిలోనే ఉన్నారు. ఎంఎల్ఎ ఎక్కడికైనా వెళ్తే ఎంఎల్ఎ తప్ప వైసిపి నుంచి వచ్చిన నేతలే ఉంటున్నారనే చర్చ సైతం ఏలూరులో జరుగుతోంది. నాని టిడిపిలో చేరడం ఖాయం కావడంతో ఏలూరులో వైసిపి పూర్తిగా ఖాళీ అయినట్లుగానే చెప్పొచ్చు. నాని చేరికను తెలుగు తమ్ముళ్లు వ్యతిరేకించినప్పుడు టిడిపి నేతలపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తాయి. గత ప్రభుత్వ హయాంలో టిడిపి కార్యకర్తలను, నేతలను ఇబ్బంది పెట్టిన వారిలో ఆళ్ల నాని ఒక్కరే లేరని, ఆయనతో కలిసి తిరిగిన మేయర్, పెదబాబు, బొద్దాని, మైబాబు అంతా ఉన్నారని, వాళ్లందరినీ చేర్చుకుని నాని చేరికను ఎందుకు వ్యతిరేకిస్తున్నారనే చర్చ సాగింది. మేయర్‌ను, పెదబాబును టిడిపిలోకి తీసుకున్నప్పుడు తీవ్ర విమర్శలు ఎదురైనా ఇక్కడి నేతలు పట్టించుకోలేదు. ఇప్పుడు ఆళ్లనాని చేరికను మాత్రం తీవ్రంగా వ్యతిరేకించిన పరిస్థితి నెలకొంది. ఆళ్ల నాని చేరికతో అసలుకే ఎసరు వస్తుందని భయం పట్టుకుందా అనే చర్చ నడిచింది. ఏదేమైనా నాని చేరికను మాత్రం ఏలూరులోని టిడిపి నేతలు అడ్డుకోలేకపోయారు. దీన్ని బట్టి ప్రస్తుతం ఏలూరులోని టిడిపి నేతల కంటే నాని పలుకుబడే టిడిపి అధిష్టానం వద్ద గట్టిగా ఉందనే సంకేతాలు వెలువడుతున్నాయి. నానికి ఎటువంటి బాధ్యతలు అప్పగిస్తారు.. ఆయన మళ్లీ ఏలూరులో చక్రం తిప్పుతారా అనే విషయాలపై సర్వత్రా చర్చ సాగుతోంది. ఏం జరుగుతుందో వేచిచూడాలి.

డిస్ట్రిబ్యూటరీ కమిటీ ఎన్నికలు పూర్తి

సాగునీటి సంఘాల ఎన్నికల్లో రెండోదశ పూర్తి

రెండు జిల్లాల్లో 28 డిస్ట్రిబ్యూటరీ కమిటీల ఎన్నిక ఏకగ్రీవం

21న ప్రాజెక్టు కమిటీ ఎన్నికలు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

సాగునీటి సంఘాల ఎన్నికల ప్రక్రియలో రెండో అంకం ముగిసింది. ఏలూరు జిల్లాలో 14, పశ్చిమలో 14 మొత్తం 28 డిస్ట్రిబ్యూటరీ కమిటీల ఎన్నికలు మంగళవారం ముగిశాయి. అన్ని కమిటీల ఎన్నికలు ఏకగ్రీవమయ్యాయి. ఈ నెల 14వ తేదీన సాగునీటి సంఘాల ఎన్నికలు జరిగాయి. ఏలూరు జిల్లాలో మేజర్, మైనర్, మీడియం మొత్తం 354 వాటర్ యూజర్స్ అసోసియేషన్ ప్రాదేశిక నియోజవర్గాలకు ఎన్నికలను నిర్వహించారు. వీటిలో మొత్తం 2,740 టిసిలకుగాను 2,621 మంది టిసిల ఎన్నిక ఏకగ్రీవమైంది. 10 మంది టిసిలను ఎన్నికల ప్రక్రియ ద్వారా ఎన్నుకున్నారు. మరో 109 టిసిలకు వివిధ కారణాలతో ఎన్నిక జరగలేదు. పశ్చిమగోదావరి జిల్లాలో మేజర్, మైనర్ మొత్తం 112 వాటర్ యూజర్స్ అసోసియేషన్ ప్రాదేశిక నియోజకవర్గాల పరిధిలో 1260 టిసిలు ఉన్నాయి. వీటిలో 1216 మంది టిసిల ఎన్నిక ఏకగ్రీవమైంది. మరో 44 టిసిలకు ఎన్నికలు పూర్తి కాలేదు. వాటర్ యూజర్స్ అసోసియేషన్ ఎన్నికలు పూర్తయిన రోజు మధ్యాహ్నం నుంచి ప్రెసిడెంట్, వైస్ ప్రెసిడెంట్ ఎన్నికలను అధికారులు పూర్తి చేశారు. ఎన్నికైన ప్రెసిడెంట్లు, వైస్ ప్రెసిడెంట్లు మంగళవారం జరిగిన డిస్ట్రిబ్యూటరీ కమిటీలకు సంబంధించి అధ్యక్ష ఉపాధ్యక్షులను ఎన్నుకున్నారు. ఏలూరు జిల్లాలో జరిగిన 14 డిస్ట్రిబ్యూటరీ కమిటీలకు సంబంధించి రిజర్వేషన్ ప్రక్రియ ప్రాతిపదికన ప్రతినిధులను ఎన్నుకున్నారు. ఈ నెల 21వ తేదీన ప్రాజెక్టు కమిటీ ఎన్నికలు జరగనున్నాయి. పశ్చిమలో ఒకటి, ఏలూరు జిల్లాలో రెండు ప్రాజెక్టు కమిటీలు ఉన్నాయి. ప్రాజెక్టు కమిటీ ఎన్నికలు సైతం పూర్తయితే సాగునీటి సంఘాల ఎన్నికల ప్రక్రియ పూర్తవుతుంది.

చలిగాలులు.. కారు మబ్బులు

చిరు జల్లులతో రైతులు ఉరుకులు, పరుగులు


ధాన్యపు రాశులపై కప్పిన పరదాలు

ప్రజాశక్తి - ముదినేపల్లి

అల్పపీడన ప్రభావంతో వాతావరణంలో మార్పులు చోటుచేసుకున్నాయి. మంగళవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆకాశం మేఘావృతమై చల్లని వాతావరణం నెలకొంది. దీంతో ఏ క్షణాన వర్షం కురుస్తుందోనని రైతులు ఆందోళన చెందుతున్నారు. మండలంలోని అనేక గ్రామాల్లో ఇప్పటికీ ధాన్యపు రాశులు కళ్లాల్లోనే ఉన్నాయి. పలు గ్రామాల్లో కోసిన వరి పైరు చేలల్లో పనలపై ఉంది. వాడవల్లి, వి.రావిగుంట, ముదినేపల్లి, పెయ్యేరు, పెదపాలపర్రు తదితర గ్రామాల్లో కోతలు కోస్తున్నారు. ఈ తరుణంలో వర్షం కురిస్తే రైతులకు తీవ్ర నష్టం వాటిల్లుతుంది. మండలంలో పలుచోట్ల చిరుజల్లులు కురవడంతో కళ్లాల్లో ఉన్న ధాన్యాన్ని కాపాడుకునేందుకు పొలాలకు రైతులు ఉరుకులు, పరుగులు పెట్టారు. పొలాల్లో ఉన్న ధాన్యాన్ని ట్రాక్టర్ల ద్వారా సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నారు. మండలంలో పెద్ద ఎత్తున ధాన్యం అమ్మకాలకు నిల్వ ఉండడంతో తేమ శాతం తగ్గించి, గిట్టుబాటు ధర పొందేందుకు రైతులు చేస్తున్న ప్రయత్నాలకు వాతావరణంలో వస్తున్న మార్పులు ఆటంకాలు కలిగిస్తున్నాయి. మండలంలోని అన్ని ప్రధాన రహదారుల్లో ఎక్కడ చూసినా నిల్వ ఉంచిన ధాన్యపురాశులు, రోడ్ల వెంబడి ఆరబెట్టిన ధాన్యం దశ్యాలే కనిపిస్తున్నాయి. రెండు నెలలుగా వరుస తుపానులు, అల్పపీడనాలు అన్నదాతలకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి.

పోలవరం: మండలంలో వాతావరణం అకస్మాత్తుగా మారిపోయింది. మంగళవారం వాతావరణం చల్లగా మారి వర్షం వచ్చే పరిస్థితులు తలెత్తడంతో రైతులు ధాన్యాన్ని సురక్షిత ప్రాంతాలకు తరలించే పనుల్లో పడ్డారు. ఇప్పటికే కోతలు కోసి మాసూళ్లు పూర్తయిన ధాన్యాన్ని పట్టిసీమ ఎత్తిపోతల పథకం, పట్టిసీమ ఎత్తిపోతల పథకం డెలివరీ ఛానల్, పట్టిసీమ శివక్షేత్రం ఫెర్రీ పాయింట్ ఆవరణలో, గూటాల, కొత్తపట్టిసీమ వీధుల్లో రోడ్లపై ఆరబెట్టారు. వాతావరణం మారడంతో వాటిపై బరకాలు కప్పి తడవకుండా రక్షించుకునే ప్రయత్నం చేస్తున్నారు.

2, 3 రోజులు వర్షాలు కురవొచ్చు
ధాన్యం రక్షణకు ముందస్తు చర్యలు
జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి

ఏలూరు: అల్పపీడనం కారణంగా జిల్లాలో మోస్తరు వర్షాలు కురుస్తాయనే వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో కోతలు పూర్తయ్యి కళ్లాల్లో ఉన్న ధాన్యం రక్షణకు ఇప్పటికే రెండు వేల టార్పాలిన్లు రైతులకు పంపిణీ చేశామని, మరో 500 టార్పాలిన్లు ముందస్తుగా సిద్ధంగా ఉంచామని జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి తెలిపారు. వర్షాలకు ధాన్యం తడవకుండా కప్పేందుకు ఇంకా అవసరమైన టార్పాలిన్లు కొనుగోలు చేసి అందిస్తామన్నారు. ధాన్యాన్ని రైతులు రైసుమిల్లులకు తరలించే ఏర్పాట్లు చేసుకోవాలని, ఆరుదల దశలో ఉన్న ధాన్యాన్ని టార్ఫలిన్లతో కప్పి తడవకుండా భద్రపర్చుకోవాలని సూచించారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియ సజావుగా నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం ప్రత్యేక అధికారులను నియమించినట్లు తెలిపారు.

గడ్డి పరకే కరువాయే..!

యంత్రాలతో వరి కోతల ఫలితమే

ట్రాక్టర్ గడ్డి ధర రూ.8 వేల నుంచి రూ.10 వేలు


మెట్టలో ట్రాక్టర్ గడ్డి రూ.12 వేలుపైనే

ఆందోళనలో పాడి రైతులు

ప్రజాశక్తి - భీమవరం

ఎండుగడ్డికి గడ్డుకాలం ఏర్పడింది. వరి పంటను యంత్రాల ద్వారా కోస్తుండటంతో గడ్డి కొరత తీవ్రమైంది. దీంతో గడ్డి ధర రోజురోజుకీ పెరుగుతోంది. జిల్లాలో ట్రాక్టర్ ధర రూ.8 వేల నుంచి రూ.10 వేల వరకు విక్రయిస్తున్నారు. ఇదే మెట్ట ప్రాంతంలోనైతే రూ.12 వేలు పైబడి పలుకుతుందంటే గడ్డికి ఎంత డిమాండ్ ఉందో అర్థమవుతోంది. ఇప్పటికే దాణా ధరలతో సతమతమవుతున్న పాడి రైతులు ఎండు గడ్డి ధర పెరిగిపోవడంతో ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఒకప్పుడు వ్యవసాయ భూమి ఉన్న ప్రతిఒక్కరికీ ఒకటో, రెండో పాడి గేదెలు ఉండేవి. ఒకపక్క వ్యవసాయం చేసుకుంటూనే మరోపక్క పాడి గేదెలను పెంచుకుంటూ దానిపై ఆధారపడి జీవిస్తుండేవారు. అయితే మారిన పరిస్థితులతో చాలామంది వ్యవసాయాన్ని, పాడి పరిశ్రమను వదిలేశారు. కేవలం కొద్దిమంది మాత్రమే వీటిని కొనసాగిస్తున్నారు. అయితే వ్యవసాయ రంగం మీదే ఆధారపడి ఉన్న పాడి పరిశ్రమ పరిస్థితి ప్రశ్నార్థకంగా మారింది. ఈ నేపథ్యంలో అటు వ్యవసాయ రైతులు, ఇటు పాడి రైతులు అష్టకష్టాలు పడుతున్నారు. జిల్లాలో సుమారు రెండు లక్షల ఎకరాలు, ఏలూరు జిల్లాలో 80 వేలకుపైగా ఎకరాల్లో రైతులు దాళ్వా సాగు చేపట్టారు. ఈ రెండు జిల్లాల్లో 50 శాతం మాసూళ్ల ప్రక్రియ పూర్తయినట్లు అధికారులు చెబుతున్నారు. అయితే వరి కోతకు యంత్రాలు ఉపయోగిస్తున్నారు. నూటికి 80 శాతం యంత్రాలపైనే వరి కోతలు పూర్తి చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఎండుగడ్డికి కొరత ఏర్పడింది. సమయం, ఖర్చు ఆదా చేసుకునేందుకు ఎక్కువ మంది రైతన్నలు వరి పంటను యంత్రాల ద్వారా కోస్తుండటంతో గడ్డి కొరత తీవ్రమైంది. ఈ నేపథ్యంలో జిల్లాలో ట్రాక్టర్ గడ్డి ధర రూ.8 వేల నుంచి రూ.10 వేల వరకు విక్రయిస్తున్నారు. అదే మెట్ట ప్రాంతంలోనైతే రూ.12 వేల నుంచి రూ.13 వేలకుపైగా పలుకుతోందని రైతులు చెబుతున్నారు. మెట్టప్రాంత పాడి రైతులు ఎండుగడ్డి కోసం పరుగులు తీస్తున్నారు. ఉంగుటూరు, గణపవరం, నిడమర్రు, తాడేపల్లిగూడెం తదితర ప్రాంతాల నుంచి మెట్ట రైతులు వరిగడ్డిని దిగుమతి చేసుకుంటున్నారు. అయితే దీన్ని అదునుగా చేసుకున్న కొంతమంది దళారులు ఎండుగడ్డిని అధిక ధరకు విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ఇప్పటికే పాడి పరిశ్రమ అంతంతమాత్రంగానే ఉంది. దాణా ధరలు అధికంగా ఉండటంతో మూగజీవాలను పెంచేందుకు పాడి రైతులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పాల ధర అధికంగా ఉన్నప్పటికీ దాణా ధర రెట్టింపు కావడంతో గిట్టుబాటు కాని పరిస్థితి ఉంది. దీంతో పాడి రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. దీంతో ఎండుగడ్డి ధర మండిపోతుంది. దీంతో పశువుల పెంపకం కష్టంగా ఉందని పాడిరైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


వరికోత యంత్రంతో కోసి పొలంలోనే చుట్టలుగా చుట్టిన ఎండుగడ్డి

ఆకాశాన్నంటిన ఎండుగడ్డి ధర

గతంలో వరి మాసూళ్ల ప్రక్రియ పూర్తయిన తర్వాత రైతులు వారి అవసరాలకు మినహాయించుకుని మిగిలిన గడ్డిని సాటి రైతులకు ఉచితంగా ఇచ్చేవారు. అయితే ఇప్పుడు ఆ పరిస్థితి కనిపించట్లేదు. ఎండుగడ్డి ధర ఆకాశాన్నంటడంతో మరింత డిమాండ్ పెరిగింది. డెల్టా ప్రాంతంలో ఎండుగడ్డి ధర ఒకలా, మెట్టప్రాంతంలో మరోలా పలుకుతుంది. పశ్చిమగోదావరి జిల్లాలో ఎకరం ఎండుగడ్డిని రైతుల నుంచి దళారులు రూ.1000 నుంచి రూ.1500 వరకు కొనుగోలు చేస్తున్నారు. ట్రాక్టర్ కిరాయికి రూ.1500, గడ్డి లోడు చేసేందుకు కూలీలకు రూ.1500 వెచ్చిస్తున్నారు. మొత్తంగా ఎకరానికి రూ.4 వేల నుంచి రూ.5వేలలోపు ఖర్చవుతోంది. అయితే ట్రాక్టర్ గడ్డిని రూ.8 వేల నుంచి రూ.పది వేల వరకు విక్రయిస్తున్నారు. ఇదే మెట్ట ప్రాంతంలోనైతే ట్రాక్టర్ గడ్డి రూ.12 వేల నుంచి రూ.13 వేలకుపైగా విక్రయిస్తున్నారు. మరికొంత మంది అయితే రూ.15 వేల వరకు అమ్మకాలు సాగిస్తున్నారు.

విద్యుత్ భారాలను ఉపసంహరించాలని నిరసన



నిరసన తెలుపుతున్న సిపిఎం నేతలు

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

విద్యుత్ భారాలను ఉపసంహరించాలని కోరుతూ సిపిఎం ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక చిన్న గాంధీబొమ్మ సెంటర్ వద్ద నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జి.రాజు మాట్లాడుతూ ప్రజలపై విద్యుత్ భారాలను ఎన్నడూ లేనివిధంగా మోపారని ఆందోళన వ్యక్తం చేశా రు. కూటమి ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమ లు చేయాలని, పెంచిన విద్యుత్ భారాలను ఉపసం హరించాలని డిమాండ్ చేశారు. స్మార్ట్ మీటర్ల బిగిం పును వెంటనే నిలుపుదల చేయాలని కోరారు. కార్యక్రమంలో పట్టణ కార్యదర్శి ఎన్ఆర్.హనుమాన్లు, నేతలు శోభనాద్రి, పద్మాంజలి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

నిర్వాసితుల ఊసెత్తకపోవడం బాధాకరం

సిఎం పర్యటన తీరుపై సిపిఎం విమర్శ

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ముఖ్యమంత్రి చంద్రబాబు పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి తమ భూములు ఇచ్చి సర్వం కోల్పోయిన నిర్వాసితుల ఊసెత్తకపోవడం, వారి గోడు పట్టించుకోకపోవడం బాధాకరమని సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. పోలవరం ప్రాజెక్టు పరిశీలనకు సోమవారం వచ్చిన ముఖ్యమంత్రి ప్రాజెక్టు పనులను పరిశీలించారే తప్ప ఆ ప్రాజెక్టుకు భూములిచ్చిన నిర్వాసితుల పరిహారం, పునరావాసం కోసం మాట్లాడకపోవడం అన్యాయమని అన్నారు. తాము ప్రాజెక్టు నిర్మాణానికి వ్యతిరేకం కాదని, 2013 భూసేకరణ చట్టప్రకారం నిర్వాసితులవుతున్న ప్రజల సమస్యలు పరిష్కరించాకే ప్రాజెక్టు పనులు చేపట్టాలనేదే తమ డిమాండ్ అని పేర్కొన్నారు.

సుమారు లక్ష కుటుంబాలు నిర్వాసితులైతే ఇప్పటి వరకు కేవలం 10 నుండి 15 శాతం మందికి మాత్రమే అరకొర పరిహారం చెల్లించి, పునరావాసం కల్పించారని తెలిపారు. పునరావాస కాలనీల్లో వర్షం వస్తే ఇళ్లు లీకేజీ అవుతున్నాయని, సరైన రోడ్లు, డ్రెయిన్లు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, స్కూళ్లు, ఉపాధి లేక అనేక అవస్థలు పడుతున్నారనే విషయం సిపిఎం ఆధ్వర్యంలో పోలవరం పోరుకేక పేరుతో నిర్వహించిన పాదయాత్ర సందర్భంగా వెల్లడైందని గుర్తు చేశారు. పోలవరం ప్రాజెక్టు జాతీయ ప్రాజెక్టుగా ప్రకటించిన కేంద్ర బిజెపి ప్రభుత్వం నిర్వాసితులకు పరిహారం చెల్లించేందుకు, పునరావాసం కల్పించేందుకు నిధులు విడుదల చేయకపోవడం అన్యాయమని పేర్కొన్నారు. బిజెపితోపాటు నిర్వాసితులకు అప్పటి వైసిపి ప్రభుత్వం, ఇప్పటి తెలుగుదేశం కూటమి ప్రభుత్వం తీరని అన్యాయం చేశాయని విమర్శించారు. విదేశీ నిపుణులను ప్రాజెక్టు పరిశీలనకు తీసుకొస్తున్న ప్రభుత్వాలు సర్వం కోల్పోయిన నిర్వాసితుల గోడు వినేందుకు గ్రామస్థాయి అధికారులను కూడా పంపడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్వాసితులకు న్యాయం చేయాలని, పూర్తి పరిహారం చెల్లించాలని, పునరావాసం, ఉపాధి కల్పించాలని రవి డిమాండ్ చేశారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

ఎంపియుపి పాఠశాలలో డిఇఒ వెంకటలక్ష్మమ్మ తనిఖీలు


విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న డిఇఒ

ప్రజాశక్తి - చింతలపూడి

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని, విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని జిల్లా విద్యాశాఖాధికారి వెంకటలక్ష్మి విద్యార్థులకు సూచించారు. మండలంలోని రేచర్ల ఎంపియుపి పాఠశాలను ఆమె మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం, ఉపాధ్యాయుల విత్యాబోధన ఎలా ఉందని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పాఠశాల రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అన్ని పాఠశాలల్లో ఇదే రకంగా రికార్డులు పకడ్బందీగా ఉండాలన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థినులు ఇష్టపడి చదివి ఆసక్తి ఉన్న రంగంలో రాణించాలన్నారు. విద్యార్థులు ఏ లక్ష్యం పెట్టుకున్నారో ఆ లక్ష్యం కోసం నిత్యం చదువుకోవాలన్నారు. ఇప్పటి నుంచి అనుకున్న లక్ష్యం కోసం ముందుకు సాగితే అది సాధించడం కష్టమేమీ కాదన్నారు. చదువుతో పాటు నైపుణ్యాలు నేర్చుకోవాలని సూచించారు. విద్యార్థులు ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని చెప్పారు. అనంతరం వంట గదిని పరిశీలించారు. భోజనంలో ఇస్తున్న మెనూ వివరాలను అక్కడి ప్రధానోపాధ్యాయులు ఎంఎస్.రాజేంద్రను, ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో చింతలపూడి మండల విద్యాశాఖ అధికారి కిరణ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఇంధన పొదుపుతో మంచి భవిష్యత్తు

జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాల్లో ఎంఎల్ఎలు బడేటి చంటి, చింతమనేని ప్రభాకర్, జెసి పి.ధాత్రిరెడ్డి


ర్యాలీని ప్రారంభిస్తున్న జెసి ధాత్రిరెడ్డి, ఎంఎల్ఎ బడేటి చంటి, చింతమనేని ప్రభాకర్

ప్రజాశక్తి - ఏలూరు

జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాల్లో భాగంగా నిర్వహించిన ర్యాలీని ఎంఎల్ఎలు బడేటి రాధాకృష్ణయ్య (చంటి), చింతమనేని ప్రభాకర్‌తో కలిసి జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్ నుండి ఫైర్‌స్టేషన్ సెంటర్ మీదుగా ఆర్ఆర్‌పేటలోని విద్యుత్ భవనం వరకు విద్యార్థులు, అధికారులు, ఉద్యోగులు, సిబ్బందితో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంధన పొదుపుపై అవగాహన కల్పించే పోస్టర్లను, కరపత్రాలను వారు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి మాట్లాడుతూ ఇంధనాన్ని పొదుపు చేయడం ద్వారా భావితరాలకు మంచి భవిష్యత్‌ను ఇవ్వొచ్చన్నారు. అవసరమైన సమయంలోనే విద్యుత్ ఉపయోగించుకోవడం ద్వారా విద్యుత్‌ను ఆదా చేయాలని సూచించారు. ఇంధన వనరుల పరిరక్షణ బాధ్యత ప్రతిఒక్కరిదని ఆమె స్పష్టం చేశారు. ఏలూరు ఎంఎల్ఎ బడేటి రాధాకృష్ణయ్య మాట్లాడుతూ ఇంధన పొదుపుపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. సూర్యఘర్ వంటి పథకాల ద్వారా లబ్ధి పొందాలని సూచించారు. గృహోపయోగాలకు స్టార్ రేటెడ్ ఉన్న ఎల్ఇడి బల్బులు, నాణ్యమైన విద్యుత్ పరికరాలను కొనుగోలు చేసుకుని వినియోగించుకోవాలన్నారు. దెందులూరు ఎంఎల్ఎ చింతమనేని ప్రభాకర్ మాట్లాడుతూ విద్యుత్ ఆదా చేయాలని, సోలార్ ఇంధన పథకానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రోత్సాహం ఇస్తున్నాయని, వాటిని వినియోగించుకోవాలని అన్నారు. డబ్బును పొదుపు చేసుకున్నట్లు విద్యుత్‌ను కూడా అవసరాల మేరకు పొదుపు చేసుకోవాలని సూచించారు. ఎపిఇపిడిసిఎల్ ఎస్ఇ పి.సాల్మన్‌రాజు మాట్లాడుతూ జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాల్లో భాగంగా విద్యుత్ వినియోగంపై గ్రామాల్లో జానపద కళాకారులు, జనవిజ్ఞాన వేదిక కార్యకర్తలతో విస్తృతంగా అవగాహనా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. జిల్లావ్యాప్తంగా పాఠశాల విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ, చిత్రలేఖనం పోటీలు నిర్వహిస్తున్నామని, అదే విధంగా స్వయం సహాయక సంఘాల మహిళా బృందాలతో ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో ఎలక్ట్రికల్ డిఇ కెఎం.అంబేద్కర్, డిఇఇ పి.రాజకుమారి, ఎఇ పి.ప్రసన్నవల్లి, డిఇఇ బివి.కృష్ణంరాజు, జిల్లా మైనారిటీ సంక్షేమాధికారి ఎన్ఎస్.కృపావరం, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

డిపార్ట్‌మెంటల్ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు

డిఆర్ఒ వి.విశ్వేశ్వరరావు

ఏలూరు : జిల్లాలో ఈ నెల 18 నుంచి 23వ తేదీ వరకు ఎపిపిఎస్‌సి నిర్వహించే డిపార్ట్‌మెంటల్ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని జిల్లా రెవెన్యూ అధికారి వి.విశ్వేశ్వరరావు సంబంధిత అధికారులను ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్ డిఆర్ఒ ఛాంబర్‌లో ఎపిపిఎస్‌సి అధికారులు, పోలీస్, విద్యుత్, వైద్యశాఖ, పరీక్షా కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్లు, లైజన్ అధికారులతో పరీక్షల నిర్వహణపై మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో వట్లూరు, ప్రభుత్వ ఐటిఐ రోడ్డులోని సిద్ధార్థా క్విస్ట్ సిబిఎస్‌సి స్కూలు, వట్లూరులోని సిఆర్.రెడ్డి ఇంజినీరింగ్ కళాశాల పరీక్షా కేంద్రాల్లో ఆఫ్ లైన్, ఆన్‌లైన్ విధానంలో డిపార్ట్‌మెంటల్ పరీక్షలు జరుగుతాయన్నారు. పరీక్షలు ఉదయం పది గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు, మధ్యాహ్నం మూడు గంటల నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు జరుగుతాయని, ఆబ్జెక్ట్ పరీక్షలు గంట ముందుగానే ముగుస్తాయని తెలిపారు. అభ్యర్థులు పరీక్ష ప్రారంభానికి గంట ముందుగానే కేంద్రానికి చేరుకోవాలని సూచించారు. అభ్యర్థులు తమతోపాటు తప్పనిసరిగా ఒరిజినల్ గుర్తింపు కార్డును తీసుకురావాలని తెలిపారు. అనుమతి పొందిన వికలాంగులు స్క్రైబ్‌ను తామే తెచ్చుకోవాలన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమల్లో ఉంటుందని, పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయాలని కోరారు. తాగునీరు, మరుగుదొడ్ల సదుపాయం ఉండేలా చూడాలని, విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగకుండా చూడాలని, వైద్య శిబిరం ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ పరీక్షలకు మొత్తం 1037 మంది అభ్యర్థులు హాజరవుతారని తెలిపారు.

ప్రజాశక్తి
www.prajasakti.com

కాలువ గట్టు వెంబడి ఆక్రమణల తొలగింపు

ప్రజాశక్తి - ఉంగుటూరు

లోకాయుక్త కోర్టు ఉత్తర్వుల మేరకు ఏలూరు కాలువ గట్టు ఇరుపక్కల ఆక్రమణలను తొలగించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని జెసిఐ చైర్మన్, ఏలూరు డిఎల్పిఒ పి.చంద్రశేఖర్ అన్నారు. జాతీయ రహదారి వెంబడి ఏలూరు కాలువ కుడి, ఎడమ గట్టు వ్యాపారాలు, నివాసాలతో ఆక్రమణలను గుర్తించి. దీనిపై లోకాయుక్తలో కె.సత్యనారాయణరెడ్డి అనే వ్యక్తి ఫిర్యాదు చేయడంతో కోర్టు తీర్పుతో డిఎల్పిఒను జాయింట్ యాక్షన్ కమిటీ చైర్మన్ (జెసిఐ)గా ప్రభుత్వం నియమించి ఆక్రమణలను అప్పగించారు. దరిమిలా బాదంపూడి నుంచి కైకరం వరకు 33 కిలోమీటర్ల నుంచి 46 కిలోమీటర్ల వరకు అనధికార కట్టడాలు, ఆక్రమణలను తొలగించేందుకు అన్ని శాఖల అధికారులతో పూర్వాపరాలను చేపట్టారు. అందులో భాగంగా గత నెలలో నారాయణపురం బజారులో ఆర్అండ్బి ఆక్రమణల తొలగింపులో చేపట్టిన పూర్వాపరాలను అమలు చేసే విధంగా మండల స్థాయి అధికారులతో సమావేశం చేపట్టారు. ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా, ప్రజలకు ఇబ్బంది లేకుండా ఆక్రమణలను తొలగించాల్సి ఉందన్నారు. ఆక్రమణదారులకు ఇళ్ల స్థలాలు చాలా మందికి ఇచ్చేశామని, ఇంకా స్థలాలు ఇవ్వని వారుంటే గుర్తించి వారికి ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శులకు ఆదేశాలు ఇచ్చారు. ఇన్చార్జి తహశీల్దార్ పూర్ణచంద్రరావు, ఇఒపిఆర్డి కె.చంద్రశేఖర్, విద్యుత్, ఇరిగేషన్, ఆర్అండ్బి, రెవెన్యూ అధికారులతో పాటు వివిధ గ్రామాల కార్యదర్శులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

వృద్ధాప్యం భావితరాలకు దిక్సూచి : ఆర్డిఒ

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

వృద్ధాప్యం అనుభవాలతో కూడిన గ్రంథమని, భవిష్యత్తు తరాలకు పెద్దల అనుభవసారాన్ని వినియోగించుకోవాలని ఆర్డిఒ ఎం.వాణి అన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో 42వ అఖిలభారత పెన్షనర్స్ డే దినోత్సవ వేడుకలు స్థానిక సమతా నగర్లోని సీనియర్ సిటిజన్స్ సంక్షేమ సంఘ భవనంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆర్డిఒ వాణి పెన్షనర్లను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో ఆర్డిఒ వాణి మాట్లాడుతూ వృద్ధాప్యం అనుభవం కూడిన గ్రంథమని, వృద్ధులను ఎవరూ భారంగా భావించకూడదని చెప్పారు.

భీమడోలు :విశ్రాంత ఉద్యోగుల సంక్షేమానికి, వారి సమస్యల పరిష్కారానికి జిల్లా ఖజానా శాఖ తమ వంతు సహాయ సహకారాలు అందిస్తుందని జిల్లా ఖజానా అధికారి టి.కృష్ణ హామీ ఇచ్చారు. భీమడోలులోని పెన్షనర్స్ అసోసియేషన్ కార్యాలయంలో మంగళవారం పెన్షనర్స్ డే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమానికి విశ్రాంత ప్రభుత్వ ఉద్యోగి పంచకర్ల సత్యనారాయణ అధ్యక్షత వహించారు.

మండవల్లి:పెన్షనర్లు సమాజానికి గొప్ప నిధి అని విశ్రాంత ఉపాధ్యాయుడు, పెన్షనర్, ప్రజాస్వామ్య పరిరక్షణ ప్రజావేదిక సభ్యులు ఎల్ఎస్. భాస్కరరావు అన్నారు. జాతీయ పెన్షనర్స్ డే ను పురస్కరించుకుని స్థానిక గ్రంథాలయం వద్ద నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పెన్షనర్లకు శుభాకాంక్షలు తెలిపారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

చలి వాతావరణం వల్ల ఎక్కువగా అనారోగ్య సమస్యలకు గురయ్యే అవకాశం ఉందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, తగు జాగ్రత్తలు పాటించాలని అసిస్టెంట్ మలేరియా అధికారి జె.గోవిందరావు సూచించారు. స్థానిక తంగెళ్లమూడి ఎంఆర్సి కాలనీ -2 సచివాలయ పరిధిలో కూడిపాడులో ప్రజలకు సీజనల్ వ్యాధులపై మంగళవారం అవగాహన కల్పించారు. ఆరోగ్య సిబ్బంది నిర్వహిస్తున్న షుగర్, బిపి, కేన్సర్ తదితర అసంక్రమిత వ్యాధుల నియంత్రణ ఎన్సిడి కార్యక్రమంలో సకాలంలో గుర్తిస్తే నివారణ సులభమవుతుందని సూచించారు.

జి.కొత్తపల్లిలో ఉచిత గుండె వైద్య శిబిరం

ప్రజాశక్తి - ద్వారకాతిరుమల

మండలంలోని జి.కొత్తపల్లి గ్రామంలో విజయవాడ ప్రముఖ గుండె వైద్య నిపుణులు వైవి.రావు హాస్పిటల్ వారు టిడిపి గ్రామ అధ్యక్షులు రేగంటి రాంబాబు ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత గుండె వైద్య శిబిరం నిర్వహించారు. గ్రామ సచివాలయం వద్ద ఈ శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా రేగంటి రాంబాబు మాట్లాడుతూ పేద ప్రజలకు, ఇలాంటి వైద్య శిబిరాలు ఎంతో ఉపయోగకరమన్నారు.

శ్రీ చైతన్య విద్యార్థులకు బంగారు పతకాలు

ప్రజాశక్తి - చింతలపూడి

కరాటే పోటీల్లో చింతలపూడి శ్రీ చైతన్య పాఠశాల విద్యార్థులు బంగారు పతకాలు సాధించటం అభినందనీయమని ప్రిన్సిపల్ సురేష్ అన్నారు. ఈ నెల 16వ తేదీ సోమవారం తణుకులో జరిగిన రాష్ట్రస్థాయి కరాటే పోటీల్లో చింతలపూడి శ్రీ చైతన్య పాఠశాల విద్యార్థులు ఎనిమిది పతకాలు సాధించినట్లు కోచ్ సుమన్‌రాజు, ప్రిన్సిపల్ తెలిపారు. నాగసాకేత్, అష్రఫ్ బంగారు పతకాలు, నితీష్, డేస్విన్, రాణా వెండి పతకాలు, జేస్విత, అర్షద్, అభిలాష్ కాంస్య పతకాలు సాధించారన్నారు.

పట్టాభి సీతారామయ్యకు ఘన నివాళి

ప్రజాశక్తి - భీమడోలు

కాలం మరిచిన స్వాతంత్ర సమరయోధులు, ఆంధ్రాబ్యాంక్ వ్యవస్థాపకులు డాక్టర్ భోగరాజు పట్టాభి సీతారామయ్య వర్ధంతి కార్యక్రమాన్ని గుండుగొలనుకు చెందిన భోగరాజు పట్టాభి సీతారామయ్య అభ్యుదయ సంఘం వారు మంగళవారం స్థానికంగా నిర్వహించారు. స్థానికంగా ఉన్న ఆయన శిలావిగ్రహానికి పూలమాలలు వేసి సత్కరించారు. పట్టాభి సీతారామయ్య సేవలను కొనియాడారు. ఆంధ్రా బ్యాంకు వ్యవస్థాపకులు డాక్టర్ భోగరాజు పట్టాభి సీతారామయ్య జయంతి, వర్ధంతి కార్యక్రమాలను ఆయన జ్ఞాపకార్థం గత, ప్రస్తుత బ్యాంకు యాజమాన్యాలు పట్టించుకోకపోవడం శోచనీయమని అభ్యుదయ సంఘం అధ్యక్షులు ఎం.కాశీహనుమాన్ బాబు ఆవేదన వ్యక్తం చేశారు.

రెవెన్యూ సదస్సుల్లో భూ సమస్యలకు పరిష్కారం

ప్రజాశక్తి - ముదినేపల్లి

భూ సమస్యల పరిష్కారమే గ్రామ రెవెన్యూ సదస్సుల ధ్యేయమని తహశీల్దార్ జెఎస్.సుభాని అన్నారు. మండలంలోని ఊటుకూరు గ్రామంలో మంగళవారం గ్రామ రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సదస్సులో సుభాని మాట్లాడుతూ ప్రభుత్వం మీ భూమి-మీ హక్కు పేర నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సుల సేవలను రైతులు,ప్రజలు వినియోగించుకోవాలన్నారు.

టి.నరసాపురం :రెవెన్యూ సదస్సులు ద్వారా భూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తహశీల్దార్ టిఎస్.సాయిబాబా తెలిపారు. మండల కేంద్రమైన టి.నరసాపురంలో మంగళవారం రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా రైతుల సమస్యలపై వినతులు స్వీకరించారు.

శిక్షణా తరగతులు ప్రారంభం

ప్రజాశక్తి - భీమడోలు

గ్రామ పంచాయతీల్లో సుస్థిర అభివృద్ధి లక్ష్యాలను అమలు చేయడం ద్వారా ఆదర్శ పంచాయతీలుగా తీర్చిదిద్దాలని భీమడోలు ఎంపిడిఒ పద్మావతి దేవి కోరారు. భీమడోలు మండల పరిషత్ సమావేశ మందిరంలో రెండు రోజుల పాటు రెండో విడతగా గ్రామ సచివాలయాల స్థాయిలో సుస్థిర అభివృద్ధి లక్ష్యాల అంశాలపై కొనసాగే శిక్షణా తరగతులను ఎంపిడిఒ మంగళవారం ప్రారంభించారు.

నేరాలు - ఘోరాలు

నాటుసారా స్థావరంపై దాడి


ప్రజాశక్తి - ముసునూరు

మండలంలోని చిల్లబోయినపల్లి గ్రామంలో ప్రొహిబిషన్, ఎక్సైజ్ అధికారులు మంగళవారం దాడి చేశారు. ఈ దాడిలో గ్రామానికి చెందిన పామర్తి నాగేశ్వరరావు వద్ద నుంచి ఒక లీటర్ నాటుసారాను స్వాధీనం చేసుకుని, నాటుసారా తయారీకి సిద్ధంగా ఉంచిన 200 లీటర్ల బెల్లపుఊటను ధ్వంసం చేసినట్లు ప్రొహిబిషన్, ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ మస్తానయ్య తెలిపారు. అదే గ్రామానికి చెందిన జోగి ధర్మరాజు వద్ద నుంచి 20 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

1700 లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం

నూజివీడు టౌన్:మండలంలోని మిట్టగూడెం అటవీప్రాంతంలో ప్రొహిబిషన్, ఎక్సైజ్ అధికారులు మంగళవారం దాడి చేశారు. ఈ దాడిలో 500 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసి, కేసు నమోదు చేసినట్లు ప్రొహిబిషన్, ఎక్సైజ్ సిఐ ఎ.మస్తానయ్య, తెలిపారు. అలాడే ఎన్‌టిఆర్ జిల్లా రెడ్డిగూడెం మండలం అన్నేరావుపేట గ్రామంలో దాడి చేసిన ప్రొహిబిషన్, ఎక్సైజ్ అధికారుల గ్రామానికి చెందిన భూక్యా శివయ్య వద్ద నుంచి పది లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకుని నాటుసారా తయారీకి సిద్ధముగా ఉంచిన 1200 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసి కేసు నమోదు చేసినట్లు చెప్పారు.


సాగునీటి డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ల ఎన్నిక


గుండుగొలను సాగునీటి డిసి చైర్మన్‌గా వెంకటలక్ష్మణ్

గుండుగొలను సాగునీటి డిసి చైర్మన్‌గా వెంకటలక్ష్మణ్

ప్రజాశక్తి - భీమడోలు

గుండుగొలను సాగునీటి డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్‌గా పూళ్ల మేజర్ సాగునీటి సంఘం అధ్యక్షులు గంధం వెంకటలక్ష్మణ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. భీమడోలు మండల పరిషత్ సమావేశ మందిరంలో మంగళవారం నిర్వహించిన డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికల కార్యక్రమానికి ఎన్నికల అధికారిగా రోడ్లు, భవనాల శాఖ ఏలూరు ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ వైవి.కిషోర్, సహాయ ఎన్నికల అధికారిగా భీమడోలు ఎంపిడిఒ పద్మావతి దేవి నిర్వహించారు. వీరికి భీమడోలు తహశీల్దార్ బి.రమాదేవితో పాటు, మైనర్ ఇరిగేషన్ శాఖకు చెందిన భీమడోలు సహాయ ఇంజినీర్ లాజర్ సహకరించారు. ఎన్నిక అనంతరం నూతన అధ్యక్షునికి ధ్రువీకరణ పత్రాన్ని ఎన్నికల అధికారి అందించారు. అనంతరం డిస్ట్రిబ్యూటరీ కమిటీకి చెందిన


ముదినేపల్లి డిసి చైర్మన్‌గా నాగేశ్వరరావు

నూతన సభ్యులు అధ్యక్షులతో కలిసి టిడిపి ఏలూరు పార్లమెంటరీ నియోజకవర్గ అధ్యక్షులు గన్ని వీరాంజనేయులును మర్యాదపూర్వకంగా కలిశారు.

నాగార్జునసాగర్ వేంపాడు మేజర్ డిసి చైర్మన్‌గా బాలకృష్ణ

ముసునూరు : వేంపాడు మేజర్ పరిధిలోని అన్ని పంట పొలాలకు నాగార్జునసాగర్, పోలవరం ప్రాజెక్టు నీళ్లు తీసుకొచ్చేలా చర్యలు చేపడతానని వేంపాడు మేజర్ డిసి చైర్మన్ రాపర్ల బాలకృష్ణ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో నాగార్జునసాగర్ వేంపాడు మేజర్ డిసి చైర్మన్‌గా రాపర్ల బాలకృష్ణను, వైస్ చైర్మన్‌గా చలమల వెంకటేశ్వరరావును నాగార్జునసాగర్ నీటి సంఘం అధ్యక్షులు కొల్లి గంగారాం, తుమ్మల లక్ష్మణరావు, తుమ్మల నాగేశ్వరరావు కమిటీ సభ్యులందరూ కలిసి ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు గద్దె రఘుబాబు, సూర్యదేవర శ్రీనివాసరావు, గద్దల మోహన్ రావు, ఉప్పలపాటి గణేష్, బొల్లినేని బుజ్జియ్య పాల్గొన్నారు.



పెదగొన్నూరు డిసి చైర్మన్‌గా సురేష్‌బాబు

ముదినేపల్లి డిసి చైర్మన్‌గా నాగేశ్వరరావు

ముదినేపల్లి :రైతాంగ సంక్షేమంలో సాగునీటి సంఘాలు కీలకపాత్ర పోషించాలని టిడిపి కైకలూరు నియోజకవర్గ కన్వీనర్ వీరమల్లు నరసింహారావు, కో కన్వీనర్ కొడాలి వినోద్ అన్నారు. ఈ సందర్భంగా మంగళవారం ముదినేపల్లి సాగునీటి డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్‌గా ఏకగ్రీవంగా ఎన్నికైన ఎన్.వీరవెంకటనాగేశ్వరావు, ఉపాధ్యక్షు లు హనుమార పేర్నీడులను, వివిధ నీటి సంఘాల అధ్యక్షు లను, నీటి సంఘం సభ్యులను కూటమి నేతలు పూలమా లలతో సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమం లో జనసేన పార్టీ మండల కన్వీనర్ వీరంకి వెంకటేశ్వరరావు, కోటప్రోలు కృష్ణారావు, అడుసుమిల్లి సాయి పాల్గొన్నారు.

పెదగొన్నూరు డిసి చైర్మన్‌గా సురేష్‌బాబు

మండలంలోని పెదగొన్నూరు సాగునీటి


వేంపాడు డిసి చైర్మన్‌గా బాలకృష్ణ

డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్‌గా గుడిసేవ సురేష్‌బాబు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. పిఎస్.విజయకుమార్ ఎన్నికల అధికారిగా వ్యవహరించారు. డిసి ఉపాధ్యక్షులుగా వైవాక నీటి సంఘం అధ్యక్షులు పోతుమూడి సోమేశ్వరరావు ఎన్నిక ఏకగ్రీవమైంది. ఈ సందర్భంగా వారిని టిడిపి నియోజకవర్గ కన్వీనర్ వీరమల్లు నరసింహారావు, కో-కన్వీనర్ కొడాలి వినోద్, జనసేన పార్టీ మండల కన్వీనర్ వీరంకి వెంకయ్య, పెద గొన్నూరు గ్రామ మాజీ సర్పంచి శివప్రసాద్, ఎన్‌డిఎ నాయకులు పూల మాలలతో సత్కరించారు.

మండవల్లి : కానుకొల్లు నీటి సంఘం అధ్యక్షులుగా కొద్దేటి సత్యనారాయణ, పెరికేగూడెం నీటి సంఘం అధ్యక్షులుగా ఎనికె రాంబాబు, గన్నవరం నీటి సం ఘం అధ్యక్షులుగా కోనపురెడ్డి కోటేశ్వరరావు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా వారిని టిడిపి నాయకులు, కార్యకర్తలు సత్కరించారు.


మండవల్లి : నియామక పత్రాలు అందుకుంటున్న డిసి సభ్యులు

ఆయిల్ ఫెడ్ కర్మాగారాన్ని ప్రయివేటీకరించొద్దు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

పెదవేగి ఆయిల్ ఫెడ్ కర్మాగారాన్ని ప్రయివేటీకరించొద్దని ఎపి రైతు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కట్టా భాస్కరరావు, కె.శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఏలూరు అన్నే భవనంలో పెదవేగి ఆయిల్ ఫెడ్ కర్మాగారం ప్రయివేటీకరణ, ఆయిల్ పామ్ రైతుల సమస్యలపై మంగళవారం మీడియాతో మాట్లాడారు. జిల్లాలో రోజురోజుకు ఆయిల్ పామ్ విస్తీర్ణం పెరుగుతోందని, దేశంలోనే అత్యధికంగా ఏలూరు జిల్లాలో ఆయిల్ పామ్ సాగు ఉందన్నారు. సహకార రంగంలో ఉన్న ఆయిల్ ఫెడ్ కర్మాగారాన్ని అభివృద్ధి చేయకుండా ప్రయివేటీకరించాలనే ప్రభుత్వ యోచన విరమించుకోవాలని కోరారు. పెదవేగి ఆయిల్ ఫెడ్ కర్మాగారాన్ని ప్రయివేటీకరిస్తే ఊరుకునేది లేదని, రైతులను సమీకరించి ఉద్యమం చేపడతామని హెచ్చరించారు.

జిల్లాస్థాయిలో జంగారెడ్డిగూడెం విద్యార్థుల ప్రతిభ


విద్యార్థులను అభినందిస్తున్న పాఠశాల హెచ్ఎం, ఉపాధ్యాయులు

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

మాతృభాషలో విద్యను అభ్యసించడం ద్వారా మంచి అవగాహనతో విషయ పరిజ్ఞానం పెంచుకుని జాతి రత్నాలుగా ఎదగాలని జంగారెడ్డిగూడెం జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాల ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయులు ఎం.విజయప్రకాష్ చెప్పారు. భాషా ప్రయుక్త రాష్ట్రాల కోసం అమరజీవి పొట్టి శ్రీరాములు ఆత్మార్పణ చేయడం ద్వారా తెలుగు రాష్ట్రం ఏర్పడిందని ఆయనకు ఘన నివాళులర్పించారు. మంగళవారం ఏలూరులో జరిగిన పొట్టి శ్రీరాములు ఆత్మార్పణ దినోత్సవం సందర్భంగా జిల్లా స్థాయిలో విద్యార్థులకు ఏర్పాటు చేసిన వ్యాసరచన, డిబేట్, క్విజ్ పోటీల్లో బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారన్నారు. జిల్లా స్థాయిలో క్విజ్‌లో ప్రథమ స్థానం తొమ్మిదో తరగతి విద్యార్థిని మల్లవరపు శ్రీప్రియ, వ్యాసరచనలో తృతీయ స్థానం తొమ్మిదో తరగతి విద్యార్థిని వల్లూరి సాయిప్రసన్న సాధించారన్నారు. వీరితో పాటు రెండు బహుమతులు గెలుచుకున్నారన్నారు. జిల్లా విద్యాశాఖాధికారి వెంకట లక్ష్మమ్మ చేతులమీదుగా బహుమతుల అందుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కమిటీ చైర్మన్ చిక్కాల సత్యనారాయణ, గణిత ఉపాధ్యాయులు ఐవిఎస్ఆర్‌కె. ప్రసాద్, ఉపాధ్యాయులు ఐవిఎస్ఆర్‌కె. ప్రసాద్ పాల్గొన్నారు.

విద్యార్థికి కళాశాల అధ్యాపక బృందం సత్కారం

ప్రజాశక్తి - భీమడోలు

రాజమండ్రి ఆదికవి నన్నయ్య విశ్వవిద్యాలయం వేదికగా ఈ నెల 13, 14 తేదీల్లో నిర్వహించిన విశ్వవిద్యాలయ స్థాయి ఆటల పోటీల్లో భీమడోలు శ్రీ వెంకటేశ్వర డిగ్రీ కళాశాల విద్యార్థులు ప్రతిభను కనబరిచారు. దీనిలో పాల్గొన్న ప్రథమ సంవత్సరం బిఎ విద్యార్థి పి.సాయిరాం 21 కిలోమీటర్ల పాటు సాగే హాఫ్ మరాథాన్ పరుగు పోటీలో పాల్గొని తృతీయ స్థానాన్ని దక్కించుకున్నారు. అంతకుముందు మంగళూరులో జరిగిన ఆలిండియా యూనివర్సిటీ ఆటల పోటీల్లో ఇదే అంశంతో పాల్గొని ప్రత్యేక గుర్తింపు పొందారని కళాశాల ప్రిన్సిపల్ బొమ్ము రవికుమార్ తెలిపారు. ఈ నేపథ్యంలో కళాశాలలో మంగళవారం నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో విశ్వవిద్యాలయ స్థాయిలో తృతీయ స్థానం సాధించిన సాయిరాంను కళాశాల ప్రిన్సిపల్‌తో పాటు ఎన్‌సిసి ఆఫీసర్ కె.శివశంకర్ ఇతర అధ్యాపక బృందం సత్కరించారు. సాయిరాంకు ప్రత్యేక శిక్షణ ఇచ్చిన కళాశాల ఫిజికల్ డైరెక్టర్ సురేష్‌కుమార్‌ను ప్రత్యేకంగా అభినందించారు.

రైతులందరూ విధిగా విత్తన శుద్ధి చేసుకోవాలి

జిల్లా వ్యవసాయాధికారి షేక్ హబీబ్‌బాషా

ప్రజాశక్తి - ముదినేపల్లి

రైతులందరూ విధిగా విత్తన శుద్ధి చేసుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి షేక్ హబీబ్ బాషా అన్నారు. మండలంలోని వడాలి, చిగురుకోట, అప్పారావుపేట గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా షేక్ హబీబ్ బాషా మాట్లాడుతూ పలు సూచనలు చేశారు.

జీలుగుమిల్లి :తుపాన్ హెచ్చరికల నేపథ్యంలో మారుతున్న వాతావరణ పరిస్థితుల దృష్ట్యా రైతులు అప్రమత్తంగా ఉండాలని మండల వ్యవసాయ శాఖాధికారి కె.గంగాధర్ తెలిపారు. మండలంలోని పి.అంకంపాలెం రైతు సేవ కేంద్రం పరిధిలో మంగళవారం నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా పలు రకాల పంటలను ఆయన పరిశీలించారు.

నూజివీడు టౌన్ : మండల పరిధిలోని బోర్వంచ, యనమదల గ్రామాల్లో వ్యవసాయ శాఖ, ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉద్యాన అధికారిణి ఆర్.హేమా మాట్లాడుతూమామిడి ఇన్సూరెన్స్ ఈ నెల 31 వరకు గడుగు పొడిగించారని, రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వ్యవసాయాధికారి ఎ.చాముండేశ్వరి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు.

టి.నరసాపురం :మొక్కజొన్న సాగు చేసే రైతులు ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకంలో బీమా పొందాలని మండల వ్యవసాయ శాఖాధికారి బి.సుమలత సూచించారు. మండలంలోని బండివారిగూడెం, అప్పలరాజుగూడెం గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పలు సూచనలు చేశారు.

ఇన్వర్టర్ వితరణ

మండవల్లి: సచివాలయంలో నెలకొం టున్న విద్యుత్ సమస్యలను పరిష్కరించే విధంగా ఇన్వర్టర్‌ను వితరణగా అందించినట్లు ఎంపిటిసి సభ్యురాలు మోరు వెంకటరమణ తెలిపారు. ఇంగిలిపాకలంక సచివాలయంలో అనేక అవసరాల నిమిత్తం వస్తున్న ప్రజలకు విద్యుత్ లేని సమయంలో ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యను దృష్టిలో ఉంచుకొని తమ కుమారుడు రాజవర్ధన్ జ్ఞాపకార్థం మూడో వర్ధంతి సందర్భంగా సుమారు రూ.20 వేల విలువైన ఇన్వర్టర్‌ను సచివాలయానికి బహుమతిగా అందించామన్నారు. ఆమెను పలువురు అభినందించారు.

నేడు మామిడి రైతులు, వ్యాపారుల సమావేశం

నూజివీడు టౌన్ :నూజివీడులో ఈ నెల 18వ తేదీ బుధవారం నూజివీడు మార్కెట్ యార్డులో మామిడి రైతులకు, వ్యాపారులకు డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ మార్కెటింగ్ వారు అగ్రికల్చర్ మార్కెటింగ్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహిస్తున్నట్లు ఉద్యాన శాఖాధికారి ఆర్.హేమ తెలిపారు.